# శ్రీ అగరాల ఈశ్వర రెడ్డి

శ్రీ అగరాల ఈశ్వర రెడ్డి ఆరవ శాసనసభ (1978-1983) స్పీకరుగా 1982వ సంవత్సరం సెప్టెంబరు 7వ తేదీన ఏకగ్రీవంగా ఎన్నికై 1983వ సంవత్సరం జనవరి 16వ తేదీ వరకు ఆ పదవిని నిర్వహించారు.

వీరు 1934వ సంవత్సరం జూలై ఒకటవ తేదీన తిరుపతిలోని తుక్కివాకంలో జన్మించారు. మద్రాసు క్రిస్టియన్ కాలేజీనుండి డిగ్రీ పట్టా పొందిన తరువాత మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో డబుల్ ఎమ్.ఎ., మద్రాసు లా కాలేజీలో ఎల్.ఎల్.బి., పిహెచ్‌డి పూర్తి చేశారు.

శ్రీ ఈశ్వర రెడ్డి 1967వ సంవత్సరములో నాల్గవ శాసనసభ, 1978వ సంవత్సరములో ఆరవ శాసనసభకు చిత్తూరు జిల్లా తిరుపతి నియోజకవర్గం నుండి శాసనసభ్యుడిగా ఎన్నికైనారు. వీరు 1980-1981 సంవత్సరాల మధ్యకాలంలో ప్రభుత్వ సంస్థల కమిటీకి అధ్యక్షునిగా పనిచేశారు. 1981-1982 సంవత్సరాల మధ్య కాలంలో డెప్యూటీ స్పీకరు హోదాలో అర్జీల, విశేషాధికారాల కమిటీల అధ్యక్షులుగా పనిచేశారు.

సభానిర్వహణ విషయంలో నియమ నిబంధనలను సమర్థవంతముగా అమలు చేసారు. సభ్యులు ప్రసంగాలు చేసే సమయంలో సంయమనం పాటించి, నిరాధారమైన ఆరోపణలు చేయరాదని పలు ప్రశస్తమైన రూలింగులను ఇచ్చారు.

వీరు ఆల్ ఇండియా పొలిటికల్ సైన్స్ అసోసియేషన్‌కు వైస్ ప్రెసిడెంట్‌గా, ఐ.ఐ.పి.ఎ. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ స్టాండింగ్ కమిటి సభ్యునిగా, మాడభూషి అనంతశయనం ఇన్‌స్టిట్యూట్ అధ్యక్షులుగా ఉన్నారు. అంతేకాక ఎస్.వి. యూనివర్సిటీ సిండికేట్ సభ్యునిగా, ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ బోర్డు సభ్యునిగా, ఉస్మానియా యూనివర్సిటీ సెనేట్ సభ్యునిగా పనిచేశారు.

శ్రీ ఈశ్వర రెడ్డి యునైటెడ్ కింగ్‌డమ్, యురోప్, రష్యా, చైనా, అమెరికా దేశాలలో పర్యటించారు.

వీరు పేరుపొందిన రచయిత. "లోక్‌సభ ఎలక్షన్స్ ఇన్ 1977 అండ్ 1980 ఇన్ ఆంధ్రప్రదేశ్, ది ఎలక్టోరల్ రిఫామ్స్ ఇన్ ఇండియా, స్టేట్ పాలిటిక్స్ ఇన్ ఇండియా అండ్ హౌ హై ఈజ్ హైయర్ ఎడ్యుకేషన్ టుడే" పుస్తకాలను రచించి ప్రచురించారు. ది హిందూ, ఆంధ్రజ్యోతి, డక్కన్ క్రానికల్ మొదలైన వార్తా పత్రికలలో వ్యాసాలు రాస్తున్నారు.

శ్రీ ఈశ్వర రెడ్డి సేవలకు గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రమశక్తి అవార్డు నిచ్చి సత్కరించింది.